క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

సిద్దిపేటజోన్: పట్టణానికి మల్లన్న సాగర్ జలాశయం ద్వారా అయ్యే నీటి సరఫరాకు గురువారం అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీజేఆర్ చౌరస్తాలో లీకేజీ మరమ్మతుల నేపథ్యంలో సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో పట్టణంలోని 23, 24, 25, 26, 27, 30, 31, 32, 33, 34 వార్డుల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలన్నారు.

ఎంపీ పరామర్శ



వెంకట్‌ను పరామర్శిస్తున్న రఘునందన్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణ బీజేపీ పార్టీ అధ్యక్షుడు వెంకట్‌ను బుధవారం ఎంపీ రఘునందన్‌రావు పరామర్శించారు. ఇటీవల వెంకట్ సోదరుడు సుధాకర్ ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఎంపీ పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట జిల్లా పార్టీ అధ్యక్షుడు శంకర్ తదితరులు ఉన్నారు.

పంటలపై అవగాహన కల్పించాలి



నానో పంట గూర్చి వివరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): అంతర పంటల ద్వారా అధిక లాభాలు గడించవచ్చని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ విశ్వ విద్యాలయం సిరిసిల్ల విద్యార్థులు బుధవారం ముంద్రాయిలోని శ్రీకాంత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న నానో పంటను పరిశీలించారు. పండు నుంచి తయారయ్యే జ్యూస్‌తో అధిక లాభాలు గడించవచ్చని, మధుమేహ రోగులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపాడు. పరిశీలించిన వారిలో విద్యార్థులు ద్రాక్షాయని, అర్చన, గాయత్రి, సుమయ్య, అలేఖ్యారెడ్డి, రైతు కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే గుర్తింపు



విద్యార్థులకు టై, బెల్టులు అందజేసిన దాతలు

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సేవతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ ప్రవీణ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం దాతల సహకారంతో విద్యార్థులకు టై బెల్టులు, బ్యాడ్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సీహెచ్. శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం రవీందర్ రెడ్డి, దాతలు రాజు, పర్శరాములు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈహెచ్‌ఎస్‌ను వెంటనే అమలు చేయండి

హుస్నాబాద్: ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్ఎస్) పథకాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో హుస్నాబాద్ శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను చెల్లించాలన్నారు. అనంతరం 2025–28 సంవత్సరానికి గాను ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హుస్నాబాద్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ గోపాల్ రావు, జనరల్ సెక్రటరీగా లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

జీవనోపాధి కల్పన వేగవంతం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): మహిళా సంఘాల సభ్యులకు బ్యాంక్ రుణాలు, జీవనోపాధి కల్పనను వేగవంతం చేయాలని, అదనపు డీఆర్‌డీఓ సుధీర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసుదేవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న సీసీలు క్లస్టర్ల వారీగా పురోగతి సాధించాలన్నారు. అంకితభావంతో, ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించారు.

కోలుకుంటున్న తిమ్మాపూర్

కొనసాగుతున్న వైద్య శిబిరాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విష జ్వరాల బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందారు. తిమ్మాపూర్‌లో ఇద్దరు, అనంతసాగర్‌లో ఒకరు డెంగీ లక్షణాలతో మృతి చెందగా, కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 16 నుంచి వైద్య శిబిరాలు ప్రారంభించారు. పారిశుద్ధ్య లోపమా? వైరస్ ప్రభావమో తెలియదు కానీ తిమ్మాపూర్‌లో ఇంటింటికీ జ్వర బాధితులున్నారు. వైద్యులు జ్వరాల బారిన పడిన ప్రతి ఒక్కరి నుంచి రక్త నమూనాలు సేకరించి, సరైన వైద్యం కోసం గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాలు ఇప్పుడిప్పుడే జ్వరాల నుంచి కోలుకుంటున్నాయి.

రెండు గ్రామాల్లో కలిపి..

తిమ్మాపూర్‌లో మొత్తం జనాభా 1300 మంది ఉండగా ఇప్పటి వరకు 1050 మందికి రక్త పరీక్షలు చేశారు. అందులో 7 మందికి వైరల్ జ్వరం బారి



తిమ్మాపూర్‌లో కొనసాగుతున్న వైద్య శిబిరం

నపడగా, 13 మంది డెంగీ బారిన పడ్డారు. కాగా ఇద్దరు చిన్నారులు డెంగీ లక్షణాలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగతా వారికి సాధారణ జ్వరాలు రాగా వారికి వైద్య శిబిరంలోనే మందులిచ్చారు. డెంగీ లక్షణాలు ఉన్న వారికి గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే అనంతసాగర్‌లో 762 మంది జనాభా ఉండగా, 480 మందికి రక్త పరీక్షలు చేశారు. 6 మందికి డెంగీ లక్షణాలు రాగా వారి గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైరల్, డెంగీ బారిన పడిన బాధితులు కోలుకున్నారని వైద్యులు రాజశేఖర్ తెలిపారు. ఇద్దరు మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. పూర్తిగా కోలుకునే వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగిస్తామని తెలిపారు.

పారిశుద్ధ్య చర్యలు

తిమ్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో మండల అధికారులు, వైద్యాధికారులు నిత్యం పర్యటిస్తూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మురికి కాల్వలు శుభ్రం చేయడంతో పాటు టీమోపాస్ పిచికారీ చేశారు. అలాగే వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. తూతూ మంత్రంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కానీ పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య నిర్మూలనకు, వర్షం నీరు రోడ్డుపై నిల్వకుండా మురికి కాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం గమనార్హం.

ఆత్మహత్య ఆలోచన వద్దు



సిద్దిపేటకమాన్: మాట్లాడుతున్న డాక్టర్ శాంతి

మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతి

సిద్దిపేటకమాన్: ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన మంచిది కాదని మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతి తెలిపారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సైకియాట్రిక్ విభాగం డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన వస్తే మానసిక వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చందర్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సురేశ్‌బాబు, నర్సింగ్ కళాశాల సిబ్బంది జయంతి, తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలతో జీవించాలి

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు తోటివారితో ప్రేమగా మెలుగుతూ, మానవతా విలువలతో జీవించాలని తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆత్మహత్యల నివారణ దినాన్ని పురస్కరించుకుని బుధవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో తెలుగుశాఖ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీకాం, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై అవగాహన

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆత్మహత్యలపై డాక్టర్ ఎండి సాదత్ అలీ పిపిటి ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పెంటయ్య, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి,లింగం పాల్గొన్నారు.

గురువులు సమాజ మార్గదర్శకులు



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక)/గదేవ్‌పూర్(గజ్వేల్): గురువులు సమాజ మార్గదర్శకులని అధికారులు పేర్కొన్నారు. బుధవారం చిన్నకోడూరులో 28 మందిని ఎంపీడీఓ జనార్దన్ , తొగుటలో 23 మందిని ఎంఈవో నర్సయ్య, జగదేవ్‌పూర్ మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ మాధవరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని పేర్కొన్నారు. తమ ఉన్నతికి కారణమైన గురువులను జీవితకాలం గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ యాదవరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హుస్నాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన 1976–1977 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 48 సంవత్సరాల తర్వాత సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా 2027లో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. కాగా పూర్వ విద్యార్థి, తెలంగాణ ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత అన్నవరం దేవేందర్‌ను సన్మానించారు. అనంతరం పరమపదించిన పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులను తలచుకొని నివాళులర్పించారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

మర్కూక్(గజ్వేల్): త్వరిత గతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అలసత్వం వహిస్తే సహించేది లేదని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. మండలంలోని గంగాపూర్- యూసుఫ్‌ఖాన్‌పల్లి , గణేశ్‌పల్లి, శావారు వెంకటాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే కేజీబీవీ పాఠశాలలో భోజన వసతులు, మరుగుదొడ్లు, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇళ్లు పిల్లర్ల దశలోనే ఉన్నాయని, వెంటనే స్లాబ్ వేసి బిల్లులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సాగర్, తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ విశాఖ, మిషన్ భగీరథ ఏఈ ప్రియంక పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న డీఈఓ

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఎం పెంటయ్య సహకారంతో క్రీడా దుస్తులను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ల మోజులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ కాంతరెడ్డి, మండల విద్యాధికారి ప్రభుదాస్, హెచ్ఎం నర్సమ్మ పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో భారీ వర్షం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో బుధవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన వీధులు జలమయమయ్యాయి. మురుగు కాలువలు రోడ్లపై పొంగిపొర్లాయి. దీంతో ఇండ్ల ముందు వరద నీరు నిలవడంతో జనాలు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పోచమ్మ గుడి నుండి శివాజీ చౌరస్తా వరకు మోకాళ్ల లోతు వర్షపు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సమీపంలోని ఇండ్లల్లోకి నీరు వెళ్లడంతో కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడ్డారు. కాగా శివాజీ చౌరస్తాలో డ్రైనేజీ సమస్య కారణంగా వర్షం కురిసిన ప్రతి సారీ వరద నీరు ఇండ్లలోకి వచ్చి చేరుతోందని కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.



శివాజీ చౌరస్తాలో భారీగా నిలిచిన వరద నీరు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా వైద్యాధికారి ధనరాజ్

తజగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. జ్వరాలతో బాధపడుతున్న బాధితుల ఇంటికెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు జ్వరం బారిన పడగానే గ్రామంలోని వైద్య శిబిరంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, వైద్యులు రాజశేఖర్, కిరణ్, భాస్కర్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిమ్మాపూర్‌లో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

సీజనల్ వ్యాధులపై అవగాహన

సిద్దిపేటకమాన్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో వైద్యాధికారులతో బుధవారం జూమ్ మీటింగ్‌లో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

సిమెంట్ రంగంలో 'భారతి'కి తిరుగులేదు

కంపెనీ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్

కొండపాక(గజ్వేల్): సిమెంట్ వ్యాపార రంగంలో భారతి సిమెంట్‌కు తిరుగులేదని ఆ కంపెనీ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుద్దెడలో గల భారతి సిమెంట్ డీలర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. వికాట్ గ్రూప్‌నకు చెందిన భారతి సిమెంట్ వాడకంలో గట్టితనం తదితర మెళుకువలపై అవగాహన కల్పించి శ్రీకాంత్ మాట్లాడారు. సిమెంట్ రంగంలో భారతి సిమెంట్ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. ఈ సిమెంట్‌ను పెద్ద పెద్ద భవన అంతస్తులకు, స్లాబ్‌లకు, బ్రిడ్జిల నిర్మాణాలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారన్నారు. తాపీ మేస్త్రీలకు రూ.లక్ష వరకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది తిరుపతి, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీల ప్రమాద బీమా చెక్కులను అందజేస్తున్న శ్రీకాంత్

అడ్వెంచర్ క్యాంప్ విజయవంతం

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన

సిద్దిపేట ఎడ్యుకేషన్: పట్టణ ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన పర్వతారోహణ అడ్వెంచర్ క్యాంపును విజయవంతంగా పూర్తి చేశారు. బుధవారం కళాశాలలో క్యాడెట్లను, ఎన్‌సీసీ కేర్‌టేకర్ కృష్ణయ్యను ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు మందుల సుష్మ, కె.సంజీవ్, కె.వంశీ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 4వరకు అరుణాచల్ దిరాంగ్ పట్టణం క్యాంపును పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, సీఓఈ గోపాలసుదర్శనం, లీలావతి పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వంటేరుకు పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి బుధవారం ఆయనను పరామర్శించారు. దౌలాపూర్‌లో ప్రతాప్‌రెడ్డి ఇంట్లో వజ్రమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెత్తందారులపై పోరాటం చేసిన ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహాలకు , చిత్రపటాలకు పలు ప్రజా, స్వచ్ఛంద సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. ఆ నాటి అరాచక పెత్తందారులపై అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. రైతు కూలీలను, శ్రమ జీవులను ఏకం చేసి తిరుగుబాటుకు మార్గాన్ని చూపిందన్నారు.



సిద్దిపేటకమాన్: ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ పాలకవర్గం, రజక సంఘం సభ్యులు



చేర్యాల(సిద్దిపేట): చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **గ్రూప్ 1 నియామకాల్లో అవకతవకలు**

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రూప్ -1 నియామకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అవకతవకలకు పాల్పడ్డదని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు గుజ్జ రాజు ఆరోపించారు. బుధవారం చిన్నకోడూరులో ఆయన మాట్లాడుతూ.. లోప భూయిష్టంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి కోర్టు తీర్పుకు మీరు చెప్పే సమాధాన ఏమిటని ప్రశ్నించారు. నాయకులు రాజశేఖర్, ఆనంద్, శ్రావణ్ ఉన్నారు.

◆ **స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసం మహేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు అజ్జు యాదవ్, పర్శరాములు, వినోద్, అనిల్, చంద్రశేఖర్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

◆ **రోడ్డు ప్రమాదాలపై అవగాహన**

బెజ్జంకి(సిద్దిపేట): వాహనాలు నడుపుతున్నప్పుడు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని బెజ్జంకి ఎస్ఐ సౌజన్య సూచించారు. మండలంలోని కల్లెపెల్లిలో బుధవారం కమ్యూనిటీ పోలిసింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు శంకర్‌రావు, ఓదయ్య పాల్గొన్నారు.

◆ **దళిత వీర్ అవార్డు అందుకున్న శంకర్**

మిరుదొడ్డి(దుబ్బాక): డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి, మండల పరిధిలోని లింగుపల్లి గ్రామానికి చెందిన పి.శంకర్ దళిత వీర్ అవార్డును అందుకున్నారు. డీబీఎఫ్ ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో చుండూరు దళిత పల్లె వీరుడు కొమ్మర్ల అనిల్‌కుమార్ 34వ వర్ధంతి సందర్భంగా బుధవారం గుంటూరు జిల్లా కేంద్రంలో పల్లెవీరుల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ భావజాలంతో సమాన గౌరవం, సాధికారత కోసం సామాజిక ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న శంకర్‌కు దళిత వీర్ అవార్డును తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ అవార్డును అందజేశారు.

◆ **ఉపాధ్యాయురాలికి సన్మానం**

చేర్యాల(సిద్దిపేట): జిల్లా స్థాయిలో జరిగిన టీఎల్ఎం మేళాలో తెలుగు విభాగంలో ప్రథమ స్థానం పొందిన కొత్తదొమ్మాట ఎంపీయూపీఎస్ ఉపాధ్యాయురాలు ఎస్.మమతను బుధవారం పాఠశాల హెచ్ఎం వెంకటరమణ, కాంప్లెక్స్ హెచ్ఎం వీరయ్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **ఆల్ ఇండియా టోర్నమెంట్‌కు ఎంపిక**

సిద్దిపేటఅర్బన్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కి సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లికి చెందిన అంబటి రాజు ఎంపికయ్యాడు. మంగళవారం హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన స్టేట్ లెవెల్ సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో జావెలిన్ త్రోలో ఆయన మొదటి స్థానంలో నిలిచాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డెహ్రాడూన్‌లో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో పాల్గొననున్నాడు.

◆ **ఉన్నత లక్ష్యాలు సాధించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని సిద్దిపేట 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని 21 వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు బుక్‌లు, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, జుబేర్ హుస్సేన్, అఖిల్, ఎన్ఎస్‌యూఐ జిల్లా సోషల్ మీడియా చైర్‌పర్సన్ స్రవంతి, అశోక్, రబ్బాని పాల్గొన్నారు.

◆ **గొర్రెల కాపరులకు అవగాహన సదస్సు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): గొర్రెలు, మేకల పెంపకదారుల అభివృద్ధికి సొసైటీ కృషి చేస్తుందని తెలంగాణ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బారాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పీర్లపల్లి గ్రామంలో గొర్రెల కాపరులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో మండలంలోని తిమ్మాపూర్, చాట్లపల్లి, పీర్లపల్లి గ్రామాల్లో 30 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశామని తెలిపారు. ప్రస్తుతం కాపరుల అభివృద్ధి, పెంపకం విధానం ఎలా ఉందో తెలుసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేడీ కొండల్‌రెడ్డి, ఏడీ రమేశ్‌బాబు, పశువైద్యాధికారి శ్వేతా, వినయ్, రమేశ్ పాల్గొన్నారు.

◆ **గొప్ప పుణ్యక్షేత్రం 'పెద్దగుండవెల్లి'**

దుబ్బాక: భక్తుల కోరికలు తీర్చే ఎంతో మహిమగల తల్లి కొలువైన పెద్దగుండవెల్లి రేణుకమాత ఆలయం గొప్ప పుణ్యక్షేత్రం అని రాజయోగి సిద్దేశ్వర మహారాజ్ అన్నారు. బుధవారం అమ్మవారిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చైర్మన్ మహేశ్, బోయ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, జైకిసాన్ సీడ్స్ కంపెనీ అధినేత చక్రపాణిగౌడ్, యాదగిరి, రాజు, దేవా, పర్శరాములు ఉన్నారు.